# నీవే నా ప్రాణం



నాలుగంతస్థుల విశాలమైన ప్రాంగణంలో వుంది విమెన్స్ కాలేజి. దట్టమైన వృక్ష సంపద వున్న కొండ ప్రాంతమంతా పచ్చగా చూడముచ్చటగా ఉంది. పట్టణ శివార్లలో ఉన్న కాలేజి వరకు తారురోడ్డు వేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అమ్మాయిలకి బస్సుసౌకర్యం కల్పించారు యాజమాన్యంవారు. ఉదయం తొమ్మిది కావొస్తోంది. సన్నపాటి ఎండ కాస్తున్నా, కొండ ప్రాంతం నుంచి వస్తున్న చల్లగాలికి ఎంతో ప్రశాంతత కలిగినట్లుంది. కాలేజి తెరిచే టైమైంది. వాహనాల జోరు హెచ్చింది. వచ్చేపోయే వారితో కాలేజి రోడ్డు హడావిడిగా వుంది. ఒకరికొకరు టాటాలు, బైబైలు, వీడ్కోలుతో సందడి మరీ ఎక్కువైంది.

కాలేజ్ హైవేకి కిలోమీటరు దూరంలో వుంది. సిటీ బస్సులు అట్నించటే వెళ్లిపోతాయి. బస్సుదిగి వస్తున్న కొంతమంది అమ్మాయిలకి దూరంగా రేఖ పుస్తకాల బ్యాగ్ పట్టుకొని

మోటార్ బైక్ మీద కూర్చున్న వ్యక్తితో నిలుచుని కనిపించింది. కాలేజీ యూనిఫారమ్ వేసుకున్న స్టూడెంట్స్ జట్లు జట్లుగా కాలేజి ఆవరణకు చేరుకుంటున్నారు.

కొలీగ్స్ దగ్గరగా వస్తున్నట్లు గమనించింది రేఖ. " నేనిక వెళ్తాను" అంది వోరగా ఒకమారు ప్రదీప్‌వైపు చూస్తూ.

'ఉష్! వదలండి మా ఫ్రెండ్స్ వస్తున్నారు. నాకు కుదరదు. మా యింట్లో ఊరుకోరు. కాలేజి చదువు మానేసే ప్రసక్తే లేదు. నాకిప్పుడు చదువే ముఖ్యం. "పెళ్లికాదు" అంది తీవ్రమైన స్వరంతోనే చేయిని విడిపించుకుంటూ.

" అయితే, నేను కాదా నీకు ముఖ్యం నామాట నమ్ము. నిన్నే చూడకుండా నేనుండలేకపోతున్నాను. నీవే నా ప్రాణం. నాకేం తెలియదు. సాయంత్రం లోగా నువ్వేదో డిసైడ్ చేసుకుని చెప్పాలి." అంటూ ప్రదీప్ చిరుకోపంతో నాసలు చిట్లిస్తూ రేఖ చేతిని వదిలి చేతి వేళ్లను పట్టుకొని ఇష్టమొచ్చినట్లు వంకర తిప్పాడు. రేఖ విలవిలలాడిపోతూ , నరాల వత్తిడికి సన్నగా కీచుగొంతుగ పెడుతూ "అమ్మా! చచ్చిపోతున్నాను, బాబోయ్" అంటూ కళ్ళనీళ్లు పెట్టుకుంది. ప్రదీప్ చేతిని వదలగానే దూరంగా జరిగి జారిపోతున్న పుస్తకాల సంచిని ఒడిసి పట్టుకుంది. పక్కకు తొలగిపోతున్న చున్నీని సరిచేసుకుంది. తనని ఎవరన్నా ఫ్రెండ్స్ గమనిస్తున్నారేమో అని అటూ ఇటూ చూసింది. అప్పటికే కొంతమంది ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ దాటిపోయారు. వారిలో ' ప్రీతి' మాత్రం నడుస్తూ ఆగి, రెండు అడుగులు వెనక్కి వేసి " రావే రేఖా, టైమైంది. బెల్లుకొట్టేస్తారు" అంది. రేఖ ఒక్క నిముషం తొట్రుపాటు చెంది, వడివడిగా నడిచి ప్రీతిని కలిసింది. ప్రదీప్ నల్ల కళ్లద్దాలు పెట్టుకుని మోటారుబైక్ మీద కూర్చుని వెళ్లిపోతున్న రేఖ వైపు తదేకంగా చూడసాగాడు.

ప్రదీప్ అక్క ' సంజయిని' అదే ఉమెన్స్ కాలేజిలో బోటనీ లెక్చరర్. ప్రతీరోజు ఆమెను డ్రాప్ చేయడానికి వస్తూ రేఖని ఇష్టపూర్వకంగా చూసేవాడు. సంజయిని తన సిస్టర్ అని రేఖకి తెలియడం కోసం ప్రయత్నించేవాడు. అక్కర్లేకపోయినా చిరునవ్వు విసరడం, మోటారుబైక్‌పై చిన్న ఫీట్లు చేస్తూ రేఖని ఆకట్టుకోసాగాడు. ఒక రోజు మాటలు కలిపాడు. ప్రేమపాఠాలు వల్లించాడు. అర్నెల్లు గడిచాయో లేదో పెళ్లికి తొందర పెట్టాడు. రేఖ ససేమిరా ఒప్పుకోలేదు.

రేఖ మధ్యతరగతి కుటుంబీకురాలు. తల్లి మాజీ ఎమ్మెల్యే ఇంట్లో పనిచేస్తోంది. తండ్రి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చిన్న ఉద్యోగంలో వున్నాడు. కట్నం సమస్య రాకుండా పెళ్లికి

సర్దుబాటు చేయవచ్చని చదివించసాగాడు.

రేఖకి చదువుమీద ఎంత శ్రద్ధ వున్నా పుట్టుకతో వచ్చే సాధారణ తెలివితేటలతో అంతగా రాణించలేకపోయేది. మరోవైపు వయసులో వచ్చే వింత ఆలోచనలు, ఏదో బలహీనత రేఖని దారిమళ్లించడానికి ఆస్కారమవుతోంది.

రేఖ, ప్రీతి తలవంచుకొని నడుస్తున్నారు. అంతలో అడుగులు తడబడ్డాయి. పాదాలముందు కనిపించే అక్షరాలను చూసి గతుక్కుమన్నారు. రోడ్డుమీద సుద్దముక్కతో ఇంగ్లీషులో రేఖ పేరుతో పాటు లవ్‌సింబల్ వేసి ఉంది.

రేఖ మనసులో ఏదో సంచలనం. దడ, భయం. ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. దగ్గర్లో ఉన్న ఆకులు తెంపి హడావిడిగా చెరిపేసారు. ముఖానికి పట్టిన చమటని ఒత్తుకోవడానికి ప్రీతి తన వద్దనున్న హేండ్ ఖర్చీఫ్ అందించింది.

రేఖ నడుస్తున్నదల్లా ఆగిపోయి అసహనంగా"– కాలేజికి రావాలనిపించడంలేదే, ఈవాల్టికి ఇంటికి వెళతాను. నా మనసేమీ బాగోలేదు." అంది తమనెవరైనా గమనిస్తున్నారేమోనని చూస్తూ.

ప్రీతి ధైర్యం చెప్పింది.–" రిలాక్స్, ఇప్పుడేమయింది. నువ్విప్పుడు క్లాస్‌కి రాకపోతే మేడమ్ ఊరుకోరు. నీమీద కంప్లైంట్స్ వున్నాయి తెలుసా? అవి మరింత బయటపడతాయి. ఇప్పటికే నీతో కలవొద్దని, తిరగొద్దని హెచ్చరిస్తున్నారు.సంజయిని మేడమ్ అయితే నీమీద పగబట్టింది. రికార్డు మార్కులు తగ్గించి నిన్ను ఫెయిల్ చేసినా చేస్తుంది. " అంది ప్రీతి స్నేహితురాలిని అన్ని విధాల సహకరిస్తూ.

ఆ మాటకి రేఖ గట్టిగా ఊపిరిపీల్చుకుని ఆలోచనలో పడింది. మొన్నీమధ్య క్లాసులో జరిగింది గొర్తొచ్చింది.

మేడమ్ క్లాసులో పాఠం చెబుతూ మధ్యలో రేఖని ప్రశ్నించింది.

ప్రదీప్ ఆలోచనలతో, ఊహలతో మరెక్కడికో పోయింది.

"రేఖా, స్టాండప్ బాడీప్రెజెంట్, మైండ్ ఆబ్సెంట్. నీవల్ల మిగతా స్టూడెంట్స్ డిస్టర్బ్ అవుతున్నారు. నీలాంటివారితో ఎవరూ ఫ్రెండ్షిప్ చేయకూడదు. బాయ్ ఫ్రెండ్స్‌కోసం కాలేజీకి వస్తున్నట్లున్నావ్. వెళ్లు, షికార్లు కొట్టిరా, ఏం అర్థమైందా మైండిట్, సిడౌన్" అంటూ సంజయిని టీచర్ హుంకరించింది భీకరంగా.

రేఖ అవమానభారంతో కృంగిపోయింది. కళ్లల్లో నీళ్లు బొటబొటా వచ్చాయి. కర్చీఫ్ తడిసిపోయింది. గిరుక్కున లేచి క్లాసు నుంచి బాయ్‌కాట్ చేసేసింది.

రేఖ రోడ్డుపక్కనున్న కల్వర్టుపై కూర్చుంటూ నీరసంగా– “ ప్రీతి, నువ్వెళ్లవే, క్లాసు మొదలయ్యేసరికి వస్తాను ” అంది పుస్తకాల బ్యాగ్ పక్కన బెడుతూ.

ప్రీతిచేతికున్న వాచి చూసుకుని మారు మాట్లాడక తన దారిన తాను వెళ్లిపోయింది.

ఫస్ట్ పిరియడ్ క్లాస్ గడచిపోయిన రేఖ క్లాసుకు రాలేదని ప్రీతి ఆందోళన పడింది. ప్రదీప్‌గాని వచ్చి రేఖని బలవంతంగా తీసుకువెళ్లాడా,ఇంటికి గాని వెళ్లిపోయిందా? ఇంతవరకు క్లాసుకు రాలేదేమిటని పదేపదిసార్లు గుమ్మంవైపు చూస్తున్న ప్రీతికి ఏవో అరుపులు, కేకలు గందరగోళం కనిపించింది. అంతలో ప్యూన్‌వచ్చి –“ రేఖ అమ్మగారు మేడమీది నుంచి దూకేసారమ్మా” అంటూ ఒక్క గావుగేక పెట్టి మరో క్లాసురూంకి పారిపోయాడు. స్టూడెంట్సంతా దిగ్భ్రాంత్రి చెంది పరుగెత్తారు. ఐదంతుస్తులపైనుంచి రేఖ గెంతేసింది. నెత్తురు మడుగులో వున్న రేఖను హుటాహుటిన కాలేజి వేన్‌లో ఆస్పత్రికి తరలించారు.

ప్రిన్సిపాల్ ఒకపక్క భయంతో, మరోవైపు ధైర్యంగా అందర్నీ ఎవరి క్లాసులోకి వాళ్లని వెళ్లమని హుంకరించింది. కాలేజి అమ్మాయిలంతా గజగజ వణికిపోయారు. ప్రిన్సిపాల్ దగ్గరుండి గార్డెన్ పైపుతో రక్తపుమరకలు కనపడకుండా వాచ్‌మెన్‌తో నీళ్లు చిమ్మించింది.

పోలీసులు వస్తారేమో,ఆనవాలు, పోలికలు వుండొద్దా? అని టీచర్స్ హితవు చెబుతుంటే ప్రిన్సిపాల్ కోపంతో కుసురుకుంది. “ కాలుజారి పడిపోయింది. మనకేమీ సంబంధం లేదు. మీ పని మీరు చూసుకోండి ” అని చిరుకోపంతో ముఖం చిట్లిస్తూ... ప్రీతి దిగులుగా, సబ్దుగా చతికిలపడిపోయింది. రేఖ గంటముందు మాట్లాడిన మాటలు, అనుకోని సంఘటన ఏదో అకస్మాత్తుగా జరిగినట్లనిపించింది.

లెక్చరర్లంతా క్లాసులు విడిచి స్టాఫ్‌రూంలో మీటింగ్ పెట్టారు. కొద్దిసేపటికి లాంగ్ బజ్జర్ మ్రోగించి కాలేజికి సెలవు ప్రకటించారు.

రేఖ తల్లిదండ్రులకు ప్రమాద విషయం తెలిసి ఒక్కమారు భోరున ఏడుస్తూ ఆస్పత్రికి పరుగెత్తారు.

ఎమర్జన్సీ వార్డులో రేఖను ఎడ్మిట్ చేసారు. “ అమ్మాయి కోమాలో ఉంది. అప్పుడే ఏమీ చెప్పలేమని డాక్టర్లు చెప్పారు. ఇద్దరూ నిస్సహాయస్థితిలో అక్కడే కూర్చుండిపోయారు.

అక్కడే ఉన్న ప్రీతిని చూసి " ఏం జరిగిందో చెప్పమ్మా" రోధిస్తూ అతృతగా అడిగారు. ఆరోజు జరిగిందంతా చెప్పింది ప్రీతి. అప్పటికే కాలేజి స్టూడెంట్లు, టీచర్లు ఆస్పత్రి ఆవరణలోకి చేరారు.

పోలీసు జీపు వచ్చింది. ఎస్ఐ నేరుగా డాక్టర్ వద్దకు వెళ్లి అంతా తెలుసుకున్నాడు. మరిన్ని వివరాలకోసం రేఖ తల్లిదండ్రుల్ని ప్రశ్నించడం మొదలుపెట్టాడు.

" ప్రదీప్ ఎవరు? " అని అప్పుడే కొంత భోగట్టా తెలిసినట్లు అడిగాడు ఎస్ఐ. రేఖ తల్లిదండ్రులు బిక్కమొహంతో చూస్తుంటే ప్రీతి కల్పించుకుని చెప్పింది.

" మా క్లాస్ మేడమ్ సంజయిని బ్రదర్. రోజు ఆమెను డ్రాప్ చేయడానికి కాలేజికి వస్తుంటాడు. అప్పుడే రేఖ పరిచయం, అలా ఫ్రెండ్స్ అయ్యారు" అని నిర్భయంగా చెప్పింది ప్రీతి. " అయితే సంజయిని వీరిద్దరిని ప్రోత్సహిస్తుందన్నమాట" ఎస్ఐ తన దర్యాప్తులో తెలిసినట్లున్నాడు.

" లేదండీ సంజయిని మేడమ్ రేఖని ఎప్పుడూ సూటిపోటి మాటలతో వేధిస్తుండేది. రేఖంటే ఆమెకిష్టంలేదు. " అని రపీమని తనేదో నోరు పారేసుకుందని భయపడి మరి మాట్లాడటం మానేసింది ప్రీతి.

ఎస్ఐ అక్కడే మూగివున్న కాలేజి అమ్మాయిల్ని చూస్తూ " ఏం మీక్కూడా బాయ్‌ఫ్రెండ్స్‌తో ఎఫైర్స్ వున్నాయా"! అంటూ లాఠీ చూపిస్తూ అడిగేసరికి భయపడి బిత్తరపోయి అంతా తలోదిక్కుకి జారుకున్నారు.

" రేఖకి తెలివిరాగానే ఇన్‌ఫారమ్ చేయండి" అక్కడినుంచి దర్జాగా బూట్లు శబ్దం చేసుకుంటూ ఎస్ఐ అతడి వెనకాల కానిస్టేబుల్స్ వెళ్లిపోయారు.

సాయంత్రం అయ్యేసరికి ప్రెస్, మీడియావారు హాట్ న్యూస్ కోసం కెమేరాలు, వీడియోలు పట్టకొచ్చి హడావిడి చేయసాగారు.

అందర్నీ నఖశిఖ పర్యంతం శల్యపరీక్షలు చేయడం మొదలెట్టారు.

రేఖ తల్లి దు:ఖావేశంతో తన కూతురు రేఖ జీవితం నాశమవడానికి కారణం కాలేజ్ లెక్చరర్లేనని ఘంటాపదంగా చెప్పింది.

విద్యార్థులు మాత్రం రేఖ బాయ్‌ఫ్రెండ్‌తో తిరగడం నిజమేనని మేడమ్స్ కూడా పదే పదేసార్లు రేఖని గుచ్చిగుచ్చి అడుగుతూ అందరిలో ఇన్‌సల్ట్ చేసేవారని చెపుతూ తమ

పేర్లు, ఫోటోలు పేపరులో వేయవద్దని చెప్పడంతో ప్రెస్ వాళ్లు ఏది నిజమైన వార్తో అర్థంకాక సతమతమయ్యారు.

కాలేజ్ స్టాఫ్‌ని ప్రశ్నిస్తే రేఖనే వేలెత్తిచూపారు. ఆ మర్నాటివరకు రేఖ పరిస్థితిలో మార్పురాలేదు. కాలేజికి అందరూ వచ్చారు. క్లాసులు జరగలేదు. అంతా స్తంభించిపోయింది.

రేఖని పరామర్శించడానికి మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి వచ్చాడు. వారింట్లోనే రేఖ తల్లి పనిచేస్తోంది. విషయం తెలిసిన ఎమ్మెల్యే వెంటనే పార్టీ కార్యకర్తల్ని కేకేసి పార్టీ పతాకాలు పట్టుకుని కాలేజికి రమ్మనిచెప్పి, ఇక్కడ ఆస్పత్రిలో అందరినీ కలసి అటు పోలీసువారికి, యిటు మీడియాకు కేసును తప్పుదారి తొక్కించొద్దని, రాజకీయం చేయొద్దని రాజనీతి ప్రయోగించారు. " రేఖకి న్యాయం జరగాలి" అమాయకులైన విద్యార్థుల్ని వేధిస్తూ బాధిస్తున్న విద్యాలయాల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. దానికి నేను, నా పార్టీ కట్టుబడి వుంటుందని తెలియజేస్తున్నాను" అన్నాడు మాజీ ఎమ్మెల్యే తన సహజధోరణితో.

పట్నంలో విద్యార్థులంతా ఏకమై రేఖకి .జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ఊరేగింపు చేశారు. పత్రికలు, టివిలు విద్యాసంస్థనే తప్పుపడుతూ మేడమ్ సంజయినిని దోషిగా ప్రకటిస్తూ అరెస్టు చేసి రేఖకు న్యాయం చేయాలని కోరాయి,

ఆ రోజు గడిచిపోయింది. రేఖకు తెలివచ్చింది. డాక్టర్లు ఊపిరిపీల్చుకున్నారు. రేఖ చెప్పబోయే వాంగ్మూలాన్ని నోట్ చేసుకోవడానికి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇదే అదునుగా ఆస్పత్రి వారు ఏభైవేలు ఖర్చులు, మరో ఏభైవేలు అడ్వాన్సుగా కట్టమని అడిగారు. రేఖ తల్లిదండ్రులకు ఎటూ పాలుపోక, ఈ ఖర్చు కాలేజీ వారే భరించాలని, తమకేమీ సంబంధం లేదన్నారు. అదేమాటపై కాలేజీ యాజమాన్యంపై వత్తిడి తెచ్చారు. ప్రిన్సిపాల్ లొంగక తప్పలేదు. అక్కడితో ఆగకుండా రేఖకి నష్టపరిహారం చెల్లించాలన్నారు. మున్ముందు వైద్యఖర్చులన్నీ భరించాలని, ఉచిత విద్యతో పాటు అదే కాలేజీలో ఆమెకు అనుకూలమైన ఉద్యోగమివ్వాలన్నారు. గొంతెమ్మ కోర్కెలతో ముందుకు వచ్చేవారిని ఎలా అడ్డుకోవాలో అర్థం కాలేదు. చివరికి యాజమాన్యం తలవంచకతప్పలేదు. మిగతా విద్యార్థుల భవిష్యత్తు ఇలాంటి దుస్సంఘటనలకు బలికాకూడదనే అభిప్రాయానికి వచ్చారు.

రేఖకి ఆరోజు సాయంత్రానికి పూర్తిగా స్పృహ వచ్చింది. అందర్నీ పోల్చుకుంది. నుదురు

చిట్లినందుకు తలకు పెద్ద కట్టువేసారు. ముందర పళ్లు ఊడిపోయాయి. కాళ్లు, చేతులకి ఫ్యాక్చరైనందున పిండికట్టు వేసారు. అటూ ఇటూ కదలలేని స్థితిలో ఉంది. మరో ఆరు నెలలు బెడ్ దిగడానికి వీల్లేదని డాక్టర్లు చెప్పారు.

రేఖ మెల్లగా మాట్లాడుతోందని తెలిసి పోలీసులు వచ్చారు. రేఖ చెప్పే వివరాలపై ఈ కేసు దర్యాప్తు సాగుతుందని, బలమైన సాక్ష్యాధారాలు రాబట్టుకోవాలని ప్రయత్నించసాగారు.

రేఖ వాంగ్మూలం విన్న పోలీసువారు, మీడియా వారు అవాక్కయిపోయారు. అప్పటివరకు పత్రికలు వ్రాసినదంతా తారుమారై పోయింది. కాలేజీ యాజమాన్యం రేఖని అన్ని విధాల ఆదుకుంటూ సహకరించినందుకు వారికి వ్యతిరేకంగా ఏమీ చెప్పరాదని ముందుగానే రేఖకి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు చెప్పడం జరిగిపోయింది.

ప్రదీప్ విషయంలో మాత్రం రేఖ స్వయం నిర్ణయం తీసుకుంది. ప్రదీప్‌కి రేఖ అంటే ఇష్టం కావున అతడికి ఈ ప్రమాదానికి ఎలాంటి సంబంధంలేదని, ఇది తన స్వయంకృతాపరాధమని చెప్పడంతో పోలీసులు మరింత ఇరకాటంలో పడ్డారు.

రేఖ చర్యతో ప్రదీప్ పోలీసుల కంట్లోనుంచి బతికిబయటపడ్డాడు. దానికి ప్రతిఫలంగా ప్రదీప్‌కు ఎంతో పెద్దశిక్ష నుంచి తప్పించినందుకు కృతజ్ఞతగా తనని ఎప్పుడు వెతుక్కుంటూ వస్తాడని ఎదురుచూడసాగింది రేఖ. ఒకరోజు రేఖ వొంటరిగా వున్న సమయంలో సంజయిని వచ్చింది. రేఖ దీనంగా ఆమె వైపుచూసింది. సంజయిని బెబ్బులిగా విరుచుకుపడింది.

" రేఖా! నువ్వేదో సాహసం చేసావని మురిసిపోతున్నావేమో, ఎలాగో బ్రతికి బయటపడ్డావు, నీ బ్రతుకు నువ్వే బ్రతుకు. ప్రదీప్ నీ జోలికి రాడని చెప్పేసి ఊరెళ్లిపోయాడు.

కాళ్లూ చేతులు విరగొట్టుకుని అందవికారిగా మారిపోయే ఆడదాన్నెవరూ ' నీవే నా ప్రాణం' అంటూ ఎదురుచూడరు. ప్రదీప్ ఎప్పుడో నిన్న మరిచిపోయాడు పగటివేషాలు మాని బుద్ధిగా చదువుకో అది చెప్పడానికే పనిగట్టుకొచ్చాను. మంచాన పడి వున్నానని పరామర్శించడానికి రాలేదు. అర్థం అయిందా, అన్నింటితో పాటు చెవుడు కూడా వచ్చిందా! ఛీ ఛీ స్టుపిడ్' అంటూ సంజయిని గుక్కతిప్పుకోకుండా తనొక లెక్చరర్‌నని అహంభావం కొట్టొచ్చినట్టు చెప్పి గిరుక్కున వెనక్కితిరిగి వెళ్లేసరికి అప్పటికే లోనికి వస్తున్న ప్రీతి ఎదురుపడింది. సంజయిని చూసి గతుక్కుమని భయంగా ' నమస్తే

మేడమ్' అంటూ ప్రీతి నిలుచుండిపోయింది. ఆమె ఒకమారు తలెత్తి చూసి ముందుకెళ్లి పోయింది ఎలాంటి సమాధానం చెప్పకుండా.

ఆమె అటు వెళ్లగానే పరుగెత్తుకుని రేఖ దగ్గరకొచ్చి వొంగుని రేఖ భుజాలు రెండు పట్టుకుని నవ్వు ముఖంతో " రేఖా ప్రదీప్ వచ్చినట్లున్నాడు. మాట్లాడే వెళ్లాడా, నువ్వనుకున్నట్లే నీ ప్రేమ ఫలించింది. నువ్వే నా ప్రాణం అన్నాడా, ఏం మాట్లాడవే' అంటూ ప్రీతి రెట్టించి అడుగుతుంటే రేఖ మాత్రం నిస్సత్తువతో కళ్లనిండా దు:ఖాశ్రువులతో కుమిలిపోతూ అలాగే మంచానికి అతుక్కుపోయినట్లుండి పోయింది.

(ఆంధ్రభూమి, 6-11-2004)